ప్రభుత్వం న్యాయం చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి

ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్

సైదాబాద్: ప్రభుత్వ నియమాల ప్రకారం హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం నుంచి భూమిని కొనుగోలు చేసిన తాము నేటికీ నిరాశ్రయులుగానే మిగిలి పోయామని ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ వై.వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సింగరేణి కాలనీలో ఆయన సొసైటీ సభ్యులతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. 1976లో ఏర్పడిన తమ సొసైటీ 1981లో సైదాబాద్ సింగరేణి కాలనీలోని 25 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిందన్నారు. 1995లో ప్రభుత్వం సొసైటీ సభ్యులకు నోటరైజ్డ్ డాక్యుమెంట్లు ఇవ్వగా, 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 727 ప్రకారం సింగరేణి కాలనీలోని 25 ఎకరాల భూమిని సొసైటీలోని 247 మంది సభ్యులకు రిజిస్ట్రేషన్ చేయించిందన్నారు. అయితే, కాలక్రమేణా ఆ భూమిలో కొందరు పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వంలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కొనుగోలు చేసిన భూమిని దక్కించుకోకుండానే తమలో కొందరు మృతి చెందారని, చాలా మంది ఉద్యోగాల నుంచి రిటైర్ అయి సొంత ఇళ్లు లేక వృద్ధాప్యంలో అద్దె నివాసాల్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుడిసెవాసులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించి, తమ స్థలాలను తమకు అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సొసైటీ కన్వీనర్ కేఎస్‌ఆర్ మూర్తి, ప్రెసిడెంట్ బాలప్రసాద్, కో కన్వీనర్ ఉదయ్‌చంద్, కోశాధికారి ఈసీ మల్లికార్జున శెట్టి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మన్సూరాబాద్: ఈ నెల 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు సామిడి శేఖర్‌రెడ్డి, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆటోయూనియన్ అధ్యక్షుడు శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆటోనగర్‌లోని ది హైదరాబాద్ మెకానికల్ అండ్ టెక్నికల్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని, మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. ఈ నెల 14న ఆటోనగర్ నుంచి ఎల్‌బీనగర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, శక్ర లింగంగౌడ్, కృష్ణయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నేతలు

జలం.. గరళం!

- చంపాపేట హరిజన బస్తీలో కలుషిత నీటి సరఫరా
- వారం రోజులుగా సమస్య మరింత జటిలం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కాలనీలో సరఫరా అవుతున్న కలుషిత నీటిని చూపిస్తున్న హరిజన బస్తీ వాసులు

చంపాపేట: దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా పైప్‌లైన్.. విస్తరణ, పూడికతీతకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ లైన్లు పక్క పక్కనే ఉండటంతో చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నల్లాల నుంచి కలుషిత నీరు సరఫరా కావడం పరిపాటిగా మారింది. కాలనీవాసులకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తామనే జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధుల హామీలు ప్రచార ఆర్భాటాలుగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

◆ చంపాపేట డివిజన్ కటకోనికుంట కాలనీ అంబేడ్కర్ విగ్రహం చౌరస్తా సమీపంలోని హరిజన బస్తీలో నెల రోజులుగా ప్రతి రోజూ గంట సరఫరా అయ్యే తాగునీటిలో అరగంట పాటు దుర్వాసనతో కూడిన మురుగు నీరు వచ్చేదని, ప్రస్తుతం వారం రోజులుగా గంట పాటు కలుషిత నీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు వాపోతున్నారు.

◆ గత్యంతరం లేక ఆ నీటిని వినియోగిస్తున్న బస్తీవాసులు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నారని తెలిపారు.

◆ ఈ నేపథ్యంలో రెక్కాడితే డొక్కాడని తాము తాగునీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పేదలు వాపోతున్నారు.

◆ కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని, ఇప్పటికైనా కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని భూగర్భ డ్రైనేజీ విస్తరణతో పాటు, నూతన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకుంటే ఆందోళన చేపట్టి ప్రభుత్వ కార్యకలాపాలను స్తంభింపజేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



హరిజన బస్తీ కాలనీలో నెల రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. జల మండలి సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందన లేదు. భూగర్భ డ్రైనేజీ విస్తరణ చేయటంతో పాటు కాలం చెల్లిన తాగునీటి పైప్ లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి. సమస్య పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చెపడతాం.

– కట్టా వెంకటేష్, హరిజన బస్తీ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు

అనారోగ్యం పాలవుతున్నాం



మా కాలనీకి తెల్లవారుజామున నీటి సరఫరా అవుతోంది. కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయాన్ని గ్రహించకపోవడంతో 15 రోజులుగా ఆ నీటినే వాడుతున్నాం. దీంతో కుటుంబ సభ్యులందరూ వాంతులు, జ్వరం వంటి సమస్యలతో ఆసుపత్రుల బాటపట్టాల్సి వచ్చింది. వేసవి ప్రారంభంలోనే కలుషిత నీటి సమస్య ఇంతగా ఉంటే ..ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన కలుగుతోంది.

– పోలుదాసు మాధవి, హరిజన బస్తీ

యుద్ధ ప్రాతిపదిక సమస్యను పరిష్కరిస్తాం

ఇంతవరకు సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని కాలనీకి పంపించి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తాం. అవసరమైతే భూగర్భ డ్రైనేజీ విస్తరణతో పాటు నూతన తాగునీటి పైప్ లైన్ కూడా ఏర్పాటు చేస్తాం. అంత వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని కాలనీవాసులకు అందిస్తాం.

– రమ్యభారతి, వాటర్‌వర్క్స్ మేనేజర్

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు పటిష్ట చర్యలు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని డీఎస్ నగర్‌లోని డ్రైనేజీలు పూడిక నిండి మురుగునీరు రహదారులపై పారుతోందని బస్తీవాసులు కార్పొరేటర్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో శనివారం కార్పొరేటర్ సెవరేజ్ సిబ్బందిని అక్కడికి రప్పించి బస్తీలోని డ్రైనేజీల్లో పూడికను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీలు బస్తీల వాసులు ఏదైనా సమస్య తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, చంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

నూతన డ్రైనేజీ పైప్‌లైన్లకు కనెక్షన్ కలపాలి

చైతన్యపురి: ఇళ్లలోని లైన్లను నూతనంగా వేస్తున్న డ్రైనేజీ పైప్ లైన్లకు కలిపే ఏర్పాటు చేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. చైతన్యపురి బాబు కాంప్లెక్ దగ్గర చైతన్యపురి కాలనీవాసులు, వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఇళ్ల యజమానులు నూతన లైన్లకు కనెక్షన్ కలుపుకోవాలంటే రూ. 20 వేల భారం పడుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటర్ వర్క్స్ అధికారులే ఈ పనులు చేసేలా చూడాలని కోరారు. ఇబ్బందులు కలుగకుండా వాటర్ వర్క్స్ అధికారులే డ్రైనేజీ కనెక్షన్లు కలిపేలా ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ సూచించారు. సమావేశంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ బలరామరాజు, డీజీఎం శ్రీనివాస్, ఏఈ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కృష్ణవేణి ఆసుపత్రిపై చర్యలు తీసుకోండి: ఎమ్మెల్యే


ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: హయత్‌నగర్ ఆర్టీసీ డిపో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టిన కృష్ణవేణి ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే పలు కాలనీ వాసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ఆక్రమణ కారణంగా రెండు డిపోలతో పాటు సుమారు 14 కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సదరు ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని పిలిపించి చర్యలు తీసుకుంటానని డైరెక్టర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

హస్తినాపురం: డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములైతే పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తారని అన్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరం పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇంజినీరింగ్ అధికారులు, ఆయా కాలనీల ప్రజలు, నాయకులు మమత, మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జానకీరామ్‌నాయక్ , రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తల వినతి

మలక్‌పేట: తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ) సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు అపర్ణ ఆధ్వర్యంలో శనివారం మూసారంబాగ్ శాలివాహననగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పని చేస్తున్న ఆశా వర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లారు. ఆశ వర్కర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రెండు నెలలుగా ఆశ కార్యకర్తలకు పారితోషికం అందడం లేదని తెలియజేస్తూ డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశామని అధ్యక్షురాలు అపర్ణ తెలిపారు. ప్రతి నెలా ఇచ్చే ఇన్‌సెంటీవ్ 5వ తేదీలోగా ఇవ్వాలని, ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డీఆర్‌ఓను కోరామని తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు నవనీత, జ్యోతి, స్వాతి, కుమారి, నారాయణమ్మ, నాగవేణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా నగరంలో వైద్యసేవలు


ఓజోన్ హాస్పిటల్ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న జీవన్‌లాల్ లవిడియా, డాక్టర్ బీవీ రావు, సత్య ప్రసాద్

నాగోలు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ప్రాణాలను కాపాడటంలో దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్ నగరంలోని ఆసుపత్రులు నిలిచాయని ఆదాయపు పన్నుల శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా అన్నారు. నగరంలోని కొత్తపేట, అల్వాల్‌లోని ఓజోన్ హాస్పిటల్ 10వ వార్షికోత్సవం శనివారం రాత్రి నాగోలులోని పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీవీ రావుతో కలిసి జీవన్‌లాల్ లవిడియా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవన్‌లాల్ లివిడియా మాట్లాడుతూ, వైద్యులు సేవా దృక్పథంలో పని చేయాలన్నారు. పదో వార్షికోత్సవ సందర్భంగా ఓజోన్ ఆస్పత్రుల యజమాన్యానికి, వైద్యులకు సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఓజోన్ హాస్పిటల్ చైర్మన్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, గత పదేళ్ల లో తమ హాస్పిటల్‌లో ఒక మిలియన్ మందికి వైద్యం చేసి వారి ప్రాణాలను కాపాడామన్నారు. నగరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లుకు ధన్వంతరి అవార్డుతో సత్కరించారు. ఆసుపత్రి సీఈఓ శ్రీనివాసరావు, డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, గడ్డం దీప్తి పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు నీటిలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. ఎంటమాలజీ ఏఈతో కలిసి శనివారం కార్పొరేటర్ చెరువు నీటిలో వ్యర్థాలను తొలగించే పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెరువు నీరు శుభ్రంగా లేక పోవటం వల్ల దోమలు విపరీతంగా వ్యాపించి సమీప కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీధి వ్యాపారులు, కాలనీల ప్రజలు చెరువులో వ్యర్థాల కవర్లను పడవేయకుండా చర్యలు తీసుకోవాలని, చెరువు కట్ట చుట్టూ జాలీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి జయప్రకాష్, చిలుకూరు రాంరెడ్డి, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, ప్రేమ్‌గాంధీ, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి భారత్ పెట్టింది పేరు

నాగోలు: ఆయుర్వేదం వైద్యానికి భారత దేశం పెట్టింది పేరు అని, ఆయుర్వేదం ద్వారా ఎలాంటి మొండి రోగం అయినా నయమవుతుందని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. డివిజన్‌లోని మమతానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల, ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నాయకులు సిద్దాల ఐలయ్య, వస్పరి మల్లేష్, పాల్యాయి సంజీవరెడ్డి, కేశిరెడ్డి పద్మరెడ్డి, రావుల శ్రీనివాస్‌గౌడ్, ఓం ప్రకాష్, స్నిగ్ధ ఆయుర్వేద వైద్యులు గోపాలం, చైతన్య, అనుపమ, అభ్యుసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సరూర్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం చెరువు నీటిలో మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల ఆ మృతదేహాన్ని బయటకు తీయించి మృతుడి వివరాల కోసం ఆరా తీయగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడి చనిపోయాడా? అనేది తెలియాల్సి ఉందని మృతి చెందాడా అనేది తెలియాల్సి ఉందని ఎస్‌ఐ అన్నారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 45, ఆలు 23, ఉల్లి 20, గోకర 45, దోస 18, సొర 11.

విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి

మలక్‌పేట: విద్యార్థుల్లో దాగిన ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో మరింత రాణిస్తారని డీఆర్‌డీఓ (జీ) శాస్త్రవేత్త యాదగిరి రామసాని అన్నారు. దిల్‌సుఖ్ నగర్ రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో–2024ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా తీర్చి దిద్దాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పట్టు సాధించేందుకు కొత్త ఆలోచనలకు పదును పెట్టలన్నారు. జోనల్ డీన్ పర్యవేక్షలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏజెడ్‌ఐ కిషోర్, డీఐ దయాకర్, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'రూ.500కు గ్యాస్ సిలిండర్' దరఖాస్తుల పరిశీలన

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేసేందుకు కృషి చేస్తున్నామని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. శనివారం మలక్‌పేటలోని డీసీ కార్యాలయంలో చేపట్టిన రూ. 500కు గ్యాస్ సిలిండర్ పథకం దరఖాస్తుల పరిశీలనను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ, మలక్‌పేట సర్కిల్–6 పరిధిలో రూ. 500 గ్యాస్ పథకం కోసం 20 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే పలువురు గ్యాస్ ఏజెన్సీ తదితర వివరాలను దరఖాస్తులో సరిగా నింపలేదన్నారు. అటువంటి దరఖాస్తుల విషయంలో దరఖాస్తుదారుని ఫోన్ నంబర్‌కు సమాచారం అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు పరిశీలన ప్రక్రియ ముగిస్తామని ఆయన తెలిపారు.

పాస్టర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ 2024 డైరీని ఎమ్మెల్యే అహ్మద్ బలాల చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యం అబ్రహం, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిత, కోశాధికారి శ్రీధర్, పాస్టర్లు క్రిస్టోఫర్, ఎలీషా లక్ష్మణ్, బిషప్ యేసురత్నం, మజ్లిస్ నాయకులు యూనస్, ఇలియాస్ పాల్గొన్నారు.

రాజకీయ నాయకులకు పీవీ స్ఫూర్తి ప్రదాత


పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భాస్కర్ రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన గొప్ప నాయకుడు, భారతరత్న పీవీ నరసింహారావు అని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాన మంత్రి, దివంగత పీవీ నరసింహారావుకు భారత దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న అవార్డును ప్రకటించిన నేపథ్యంలో శనివారం అల్కాపురి చౌరస్తాలో పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు పీవీ స్ఫూర్తిదాయకమని అని అన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్,వెంకటేశ్వర్లు, తలాటి రమేశ్ నేత, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ



వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీకృష్ణ మెమోరియల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్‌లో ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ రేస్ తదితర అన్ని విభాగాల్లో తమ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారని శ్రీనివాసపురం కాలనీలోని సెయింట్ ఆన్స్ పాఠశాల చైర్మన్ కుంట్లూరు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని, తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ వీడియో పాట చిత్రీకరణ ప్రారంభం

నాగోలు: విలక్షణ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య రచన, దర్శకత్వంలో డాక్టర్ జి.నాగమణి నిర్మాణంలో సందేశాత్మక డాక్టర్ వీడియో పాట చిత్రీకరణ శనివారం నాగోలులోని డాలీ జిమ్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ, అమ్మ జన్మనిస్తే..మనకు పునర్జన్మనిచ్చే ప్రాణదాతలు వైద్యులని, వైద్య వృత్తిలో ఉన్న ప్రాణదాతలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు.ఈ సాంగ్‌లో డాక్టర్ జి.నరసింహా రావు నేత, డాక్టర్ సందీప్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారని తెలిపారు.

సేవాలాల్ జయంతికి ఐచ్ఛిక సెలవు ప్రకటనపై ధన్యవాదాలు

మన్సూరాబాద్: గిరిజన, బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంత్రి సందర్భంగా ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు ప్రకటించినందుకు టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ గాంధీనాయక్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎల్‌బీనగర్‌లో ఆయన మాట్లాడుతూ, వచ్చే జయంతి నాటికి బంజారాహిల్స్‌లో సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమన్నారు. లంబాడీలు మాట్లాడే గోర్‌బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్‌లో చేర్చడానికి తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు.